క్లుప్తంగా

రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి



తిరువూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్. నాగేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక బైపాస్ రోడ్డు నుంచి రాజుపేట వరకు వామ పక్ష అనుబంధ రైతు సంఘాల ఆధ్వర్యంలో ట్రాక్టర్లు, బైక్‌లపై ర్యాలీ నిర్వహించారు. ఫ్యాక్టరీ సెంటర్‌లో జరిగిన సభలో నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఎరువులపై సబ్సిడీ పునరుద్ధరించాలని, స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వామపక్షాల నాయకులు తూము కృష్ణయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, సుబానీ, సత్యనారాయణ, వనమాలి, ఉదయ్, భద్రం, రవి, వెంకటేశ్వరరావు, నాగేంద్ర ప్రసాద్, ఆలీబాబా, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

మరియమాత స్వరూప ప్రతిష్ఠ



చాట్రాయి: సి గుడిపాడు దళితవాడ ఆర్‌సీఎం చర్చి ఆవరణలో నూతన మరియమాత స్వరూప ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటలీ దేశానికి చెందిన ఫాదర్ ఫ్రాన్స్కో రఫాసియా ప్రార్థన చేసి మరియమాత స్వరూపాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం 2,500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో చనుబండ ఆర్‌సీఎం చర్చి ఫాదర్ గోనె నరేష్, ఫాదర్ కంచపోగు జోజప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యలపై అర్జీలను స్వీకరిస్తామన్నారు.

తిరంగా.. సగర్వంగా..

- వాడవాడలా గణతంత్ర వేడుకలు
- ఉత్సాహంగా జాతీయ పతాకాల ఆవిష్కరణ
- మహానేతల స్ఫూర్తితో ముందుకు సాగాలని వక్తల పిలుపు

తిరువూరు: గణతంత్ర వేడుకలు తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాయకులు, అధికారులు జాతీయ పతాకాలను ఎగురవేసి స్వీట్లు పంచారు. పలుచోట్ల జాతీయ నేతల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం జాతీయ నేతల పోరాటాలు, త్యాగాలను వక్తలు వివరించారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని పేర్కొన్నారు. తిరువూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీఓ మాధురి, కోర్టు ఆవరణలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్, స్టేట్ బ్యాంకులో మేనేజరు రవికుమార్, పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ లక్ష్మి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రార్ జగన్, నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ లోవరాజు జాతీయ పతాకావిష్కరణ చేశారు. తిరువూరు డివిజన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రెవెన్యూ సిబ్బందికి ఆర్డీఓ మాధవి ప్రశంసాపత్రాలు అందజేశారు. తిరువూరు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పాత తిరువూరు ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు మిఠాయిలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.

గంపలగూడెం మండలంలో..

గంపలగూడెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయం, మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. పెనుగొలను శాఖా గ్రంథాలయం, గుళ్లపూడి, పెనుగొలను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గణతంత్ర వేడుకలు జరిగాయి.

ఎ.కొండూరు మండలంలో...

ఎ.కొండూరు తహసీల్దారు కార్యాలయం, ఎంపీపీ కార్యాలయం, కంభంపాడు, చీమలపాడు, కోడూరు, ఎ.కొండూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో, కంభంపాడు విద్యుత్ సబ్ స్టేషన్‌లో గణతంత్ర వేడుకలు నిర్వహించారు.

తిరువూరు మండలంలో...

కోకిలంపాడు, మునుకుళ్ల, ముష్టికుంట్ల, గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలు, వావిలాల, రాజుగూడెం ఎంపీయూపీ స్కూళ్లు, ఆంజనేయపురం, చిట్టేల గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అధికారులు జాతీయ పతాకావిష్కరణ చేశారు. శ్రీనిధి స్కూల్, వాహినీ ఇంజినీరింగ్ కళాశాలల్లో పతాకావిష్కరణలు జరిగాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



తిరువూరులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ మాధురి

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ

జి.కొండూరు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకలకు ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జెండా ఆవిష్కరణ అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను ఎంపీపీ, సర్పంచ్ మండల అరుణ చేతుల మీదుగా అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం, పలు పాఠశాలల్లో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో ఎంపీపీ పాల్గొన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాల్లో రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైలవరం మండలంలో..

మైలవరం: మైలవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అనూరాధ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అబ్దుల్ దరియా, మైలవరం కోర్టు ప్రాంగణంలో జడ్జి శైలజ జాతీయ జెండాను ఆవిష్కరించారు. మైలవరంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో సంబంధిత అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు పతాక ఆవిష్కరణ చేశారు. మైలవరం ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో ఏసీపీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. చంద్రాల గ్రామంలో సర్పంచ్ జె.జ్యోతి, వివిధ గ్రామ పంచాయతీల కార్యాలయాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు జాతీయ జెండా ఆవిష్కరించారు. మైలవరం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆర్. దయాకర్, గంటా శ్రీనివాసరావులకు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉత్తమ బెస్ట్ అవార్డులు అందజేశారు. రెడ్డిగూడెం మండలంలో తహసీల్దార్ సుశీలాదేవి తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించారు.



మైలవరం కోర్టు ప్రాంగణంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న జడ్జి శైలజ



ముసునూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద పతాకావిష్కరణ

ఘనంగా గణతంత్ర దినోత్సవం

ఇబ్రహీంపట్నం: మూలపాడు జెడ్పీ పాఠశాలలో ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య అలవర్చుకోవాలన్నారు. ఎన్టీటీపీఎస్‌లో చీఫ్ ఇంజినీర్ నాగరాజు జెండా వందనం చేశారు. నిమ్రా కళాశాలలో అకడమిక్ డైరెక్టర్ టి.నారాయణమూర్తి జెండా ఎగురవేశారు. లియో హోండా ఆధ్వర్యంలో జరిగిన బైక్ ర్యాలీలో ఎస్ఐ జి.విజయలక్ష్మి, పోలీసులు పాల్గొన్నారు. కాచవరం ఎంపీపీ పాఠశాలలో సర్పంచి డి.రాజేంద్రప్రసాద్ విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు. హెచ్ఎం అమర్ నాయక్ పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నంలో బీజేపీ నాయకులు రేగళ్ల రఘునాథరెడ్డి జెండా వందనం చేశారు. కొండపల్లి పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ జెన్‌కో జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించారు. డీసీసీ కార్యదర్శి బొర్రా కిరణ్ జాతీయ జెండా ఎగురవేశారు.

రాజ్యాంగ లక్ష్యాలు నెరవేరడం లేదు : స్వామిదాసు

తిరువూరు: భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులను పాలకులు కాలరాస్తున్నారని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం గణతంత్ర వేడుకలు జరిగాయి. జాతీయ పతాకాన్ని స్వామిదాసు ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా భారత రాజ్యాంగం అమలు తీరు ప్రశ్నార్థకంగా ఉందని, ఎన్నికల సంస్కరణలు వస్తేనే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో డబ్బులు వెదజల్లే సంస్కృతి పోవాలని చెప్పారు. దేశంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రిజర్వేషన్లు అమలు చేసినా ఆశించిన ఫలితం రాలేదన్నారు. నిరక్షరాస్యత, పేదరికం నిర్మూలనలో పాలకులు విఫలమయ్యారని చెప్పారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు పల్లెపాటి శ్రీనివాసరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



తిరువూరులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన స్వామిదాసు



ముసునూరు రెవెన్యూ కార్యాలయం వద్ద పతాకావిష్కరణ



జి.కొండూరులో పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు అందజేస్తున్న ఎంపీపీ, సర్పంచ్

ముసునూరు: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ జి.రాణి, ఈఓపీఆర్డీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. వైస్ ఎంపీపీ రాజానాయన, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. మండల రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ రాజ్‌కుమార్, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ ఎం.చిరంజీవి, మానవ వనరుల కేంద్రం వద్ద ఎంఈఓ బీవీ సుబ్బారావు, పీహెచ్‌సీల వద్ద వైద్యాధికారులు షకీనా ఇవాంజిలిన్, కరిముల్లా, వ్యవసాయ శాఖ ఏఓ సూరిబాబు ఆధ్వర్యంలో సొసైటీలు, రైతు సేవా కేంద్రాల వద్ద ఆయా అధ్యక్షులు జాతీయ పతాకాలను ఎగురవేశారు.



మూలపాడు జెడ్పీ పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వసంత



తిరువూరు శ్రీనిధి స్కూల్‌లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



ఇబ్రహీంపట్నంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎస్ఐ విజయలక్ష్మి, పోలీస్ సిబ్బంది

రాజ్యాంగం దృష్టిలో అందరూ సమానమే



నూజివీడులోని న్యాయస్థానాల భవనం వద్ద వేడుకల్లో 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ, న్యాయమూర్తులు



నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ తదితరులు

సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజు

నూజివీడు: భారత రాజ్యాంగం దృష్టిలో ప్రతి ఒక్కరూ సమానమేనని, అందరికీ రాజ్యాంగ ఫలాలు అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆదివారం జాతీయ పతాకాన్ని సబ్ కలెక్టర్ ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు నుంచే మన దేశం సర్వసత్తాక ప్రజాస్వామ్య దేశంగా మారిందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ధన, మాన, ప్రాణాలు లెక్కచేయక అశువులు బాసిన త్యాగమూర్తుల ఆశయాలు భావితరాలకు ఆదర్శం కావాలన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో...

దేశంలోని ప్రజలందరికీ రాజ్యాంగం సమాన అవకాశాలను కల్పించిందని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ అన్నారు. స్థానిక కోర్టు భవనాల ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆమె ఎగురవేసి మాట్లాడారు. ప్రజలందరూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి, స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్య ప్రకాష్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి ఎగురవేశారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో చాన్సలర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి మాట్లాడారు. ఏఓ బి. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. పీజీ కేంద్రంలో జరిగిన వేడుకల్లో కృష్ణా యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య మండవ బసవేశ్వరరావు, ప్రిన్సిపాల్ జె. నవీన లావణ్యలత పాల్గొన్నారు. డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, సీఐ కార్యాలయంలో సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ, పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ పి. సత్య శ్రీనివాస్, రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఎస్. లక్ష్మణ్ బాబు, ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ బీవీ సుబ్బారావు, హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ దూళిపాళ్ల అపర్ణ, ఏరియా ఆస్పత్రి వద్ద సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. నరేంద్ర కృష్ణ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. మండలంలో, పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో, ఆయా పాఠశాలల్లో ప్రిన్సిపాల్స్ జాతీయ జెండాను ఎగురవేశారు. గ్రంథాలయం వద్ద గ్రంథాలయ అధికారి, వసతిగృహాల వద్ద వార్డెన్లు జాతీయ పతాకాలను ఎగురవేశారు.

ఆగిరిపల్లి మండలంలో..

ఆగిరిపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్, మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఆనంద్ బాబు, పీఎస్‌లో ఎస్ఐ శుభశేఖర్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ యోహాను జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయిని పుష్పలత జాతీయ జెండాను ఎగురవేశారు. తాడేపల్లి చొప్పరమెట్లలోని కేకేఆర్ హ్యాపీ వ్యాలీ పాఠశాలలో పాఠశాల డైరెక్టర్ ఆనంద్ కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు.

చాట్రాయి మండలంలో..

చాట్రాయి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీపీ లంకా నిర్మల, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చల్లగుళ్ల జగన్‌మోహనరావు, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ డి. రామకృష్ణ, రెవెన్యూ కార్యాలయంలో డీటీ ఈశ్వరరావు, ఎంఈఓ బ్రహ్మాచారి, చాట్రాయి సచివాలయంలో సర్పంచ్ దామెర ఉషా, ఆయా గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఆయా పాఠశాలల్లో హెచ్ఎంలు జాతీయ జెండా ఎగురవేశారు.



గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఎస్ఐ శుభశేఖర్, సిబ్బంది



కేకేఆర్ హ్యాపీ వ్యాలీ పాఠశాలలో కవాతు నిర్వహిస్తున్న విద్యార్థినులు



మండల పరిషత్ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

తిరువూరులో తీరని మంచినీటి సమస్య

- అక్కరకు రాని తాగునీటి పథకాలు
- శిథిలావస్థలో ఓవర్ హెడ్ ట్యాంకులు
- అసంపూర్తిగా నిలిచిన రిజర్వాయర్ పనులు

తిరువూరు: 40వేల జనాభా ఉన్న తిరువూరు పట్టణంలో తాగునీటి సమస్య తీరే మార్గం కనిపించడం లేదు. ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు పంపడం, అవి మరుగున పడిపోవడం మినహా శాశ్వత మంచినీటి పథకాల అమలులో పాలకులకు చిత్తశుద్ధి కరువైందని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. పట్టణ జనాభా అవసరాల మేరకు రోజుకు 7.5 మిలియన్ లీటర్ల నీటిని కుళాయిల ద్వారా సరఫరా చేయాల్సి ఉండగా ప్రస్తుతం 3 మిలియన్ లీటర్ల నీరు మాత్రమే ఇవ్వగలుగుతున్నారు. సగటున మనిషికి 130 లీటర్ల నీరు రోజుకు అవసరముండగా 60 లీటర్లకు మించి సరఫరా చేసే పరిస్థితి లేదు. ప్రస్తుతం ఉన్న మూడు ఓవర్ హెడ్ ట్యాంకుల సామర్థ్యం 2.1 లక్షల లీటర్లు మాత్రమే కాగా రెండు రోజులకు ఒకసారి మాత్రమే కుళాయి నీరందించగలుగుతున్నారు.



తిరువూరులో శిథిలావస్థలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు

శిథిలావస్థలో ఓవర్‌హెడ్ ట్యాంకులు

30 సంవత్సరాల కిందట నిర్మించిన తిరువూరు పట్టణంలోని ఓవర్ హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. తరచూ మరమ్మతులు చేస్తున్నప్పటికీ నిల్వ చేసిన నీరు లీకేజీలతో వృథా కావడంతో ప్రైవేటు కుళాయిల ద్వారా సరిపడా నీరందించలేకపోతున్నారు. 4 వేల ప్రైవేటు కుళాయిలు, 500 పబ్లిక్ కుళాయిలు ఉన్నప్పటికీ సక్రమంగా నీరందంచలేకపోతున్న నగర పంచాయతీ అధికారులు కుళాయి పన్ను వసూలు చేయడానికి వెనుకాడుతున్నారు.

నిలిచిపోయిన కొత్త ట్యాంకు పనులు

కృష్ణా నది నుంచి పైపు లైన్ల ద్వారా తిరువూరు పట్టణానికి తాగునీరు సరఫరా చేస్తే నిల్వ చేసే నిమిత్తం పాత తిరువూరు, రాజుపేట, నడింతిరువూరులలో కొత్త రిజర్వాయర్లు నిర్మించాలని నగర పంచాయతీ పబ్లిక్ హెల్త్ అధికారులు ప్రతిపాదించారు. మండల పరిషత్ కార్యాలయం పక్కన కొత్త రిజర్వాయరు నిర్మాణం చేపట్టినప్పటికీ పునాది దశలోనే నిలిచిపోయింది. కొత్త ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించడంతో పాటు పైపులైన్ల లీకేజీలు అరికట్టి వేసవిలో మంచి నీటి సమస్య నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ పరిశీలనలో పైలట్ ప్రాజెక్టు



తిరువూరు పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా నిమిత్తం గతంలో చేపట్టిన పైలట్ ప్రాజెక్టు పునరుద్ధరణకు ప్రభుత్వానికి ప్రతిపాదించాం. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి. ప్రజల అవసరాలకు సరిపడా మంచినీరందించడానికి ప్రయత్నిస్తున్నాం.

– లోవరాజు, కమిషనర్, నగర పంచాయతీ, తిరువూరు

ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించాలి



తిరువూరు పట్టణంలో ప్రజల అవసరాలకు సరిపడా కొత్త ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించాలి. గతంలో ఉన్న ట్యాంకులు శిథిలావస్థకు చేరినందున పాత తిరువూరు, నడిం తిరువూరు, రాజుపేటలలో ట్యాంకులు నిర్మించి కుళాయి నీరు ప్రతి రోజూ సరఫరా చేయాలి.

– గుంటూరు మస్తాన్, నగర పంచాయతీ కో–ఆప్షన్ సభ్యుడు, తిరువూరు

లీకేజీలు అరికట్టాలి



రక్షిత మంచినీరు సరఫరా చేసే పైపు లైన్లు చాలా చోట్ల లీకేజీ ఉండటంతో నీరు వృథాగా పోతోంది. లీకేజీలు అరికట్టడంతో పాటు పాత పైపు లైన్లు మార్పు చేసి కొత్తవి వేయాలి. వేసవిలో మంచినీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి.

– ముదిగొండ దుర్గాప్రసాద్, తిరువూరు

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆందోళన

మైలవరం: రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీఐటీయూ మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు. మైలవరం నూజివీడు రోడ్డులోని గాంధీ గ్రంథాలయం వద్ద రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సుధాకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మూడో సారి అధికారం చేపట్టి కార్పొరేట్‌లకు సంవత్సరానికి మూడు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తోందని, రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర లేకుండా పోయిందని అన్నారు. రైతు చట్టాలను కార్పొరేట్‌లకు తాకట్టు పెట్టి, రైతుల ప్రాణాలు తీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కార్మికుల హక్కులు కాలరాసేలా 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని, దీని వలన కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుందని చెప్పారు. రైతులు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌కే విద్యార్థుల ప్రతిభ

మైలవరం: మైలవరం కొత్త చంద్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడా సంబరాల్లో మైలవరం ఎస్ఎస్‌కే పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి 12 ఈవెంట్లకు గాను 9 ఈవెంట్లలో గెలుపొందారని పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి మోహనరావు ఆదివారం తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను పాఠశాల కరస్పాండెంట్ గొల్లపూడి భావన, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

నేడు గుండె వైద్య శిబిరం

ముసునూరు: గుళ్లపూడి సచివాలయం వద్ద సోమవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తారని సర్పంచ్ రాజబోయిన శ్రీదేవి శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు శిబిరం జరుగుతుందని చెప్పారు.